ప్రజాశక్తి

శనివారం 7 సెప్టెంబర్ 2024 8 పేజీలు



తిరుపతి

చిత్తూరు

వినాయక చవితి శుభాకాంక్షలు : కలెక్టర్

కట్టుకున్నోడే... కాలయముడై...

2లో

సత్యవేడుకు ఉప ఎన్నిక తప్పదా..?

ఎంఎల్ఎ ఆదిమూలం రాజీనామా చేస్తారని ప్రచారం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సత్యవేడుకు ఉప ఎన్నిక తప్పేలా లేదు. లైంగిక వేధింపుల కేసులో ఇరుక్కున్న సత్యవేడు ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం ఎంఎల్ఎగా రాజీనామా చేస్తారని ప్రచారం ఊపందుకుంది. నియోజకవర్గంలో టిడిపి వర్గాలు ఆదిమూలం అనుకూల, ప్రతికూల గ్రూపులుగా విడిపోయాయి. ఆయన వ్యతిరేక గ్రూపు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని అంటుంటే, అనుకూలురు ఇదంతా పార్టీకి చెందిన కొందరు పథకం ప్రకారం పన్నిన కుట్రని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఆదిమూలం తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తారనే ప్రచారం పార్టీ వర్గాల్లో ఊపందుకుంటోంది. ఈ ప్రచారం మాటున గతంలో సత్యవేడు నియోజకవర్గ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడిన వారిలో కొందరు ఈసారి మరింత గట్టిగా టికెట్ తెచ్చుకోవాలని అప్పుడే ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. తాను వైసిపి ఎంఎల్ఎగా ఉన్నపుడు పెద్దిరెడ్డిపై

2లో

అల్లర్లలో నష్టపోయిన వారిని ఆదుకుంటాం : కలెక్టర్

ప్రజాశక్తి -వికోట

మండల కేంద్రమైన వి కోటలో ఇటీవల చోటు చేసుకున్న ఘర్షణల్లో నష్టపోయిన బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. స్థానిక పంచాయతీరాజ్ అతిధి గహంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులతో వారు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అల్లరి మూకల దాడుల్లో నష్టపోయిన దుకాణదారులు నష్ట అంచనా వేయాలని సూచించారు. ప్రభుత్వపరంగా నష్టపరిహారం ప్రతి ఒక్కరికి అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండుగను ఆనందోత్సహాలతో జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటువంటి అల్లర్లకు అవకాశం లేకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి నిఘ ఉంచాలని పోలీస్ శాఖను ఆదేశించారు. వీరి వెంట పలమనేరు డిఎస్పి ప్రభాకర్, తాసిల్దార్ పార్వతమ్మ , ఎంపీడీవో మహమ్మద్ రఫీ ఉన్నారు.



వార్త తరువాయి..

సత్యవేడుకు ఉప ఎన్నిక తప్పదా..?

తీవ్రస్థాయిలో ధ్వజమెత్తడంతో కక్షపూరితంగానే తనపై ఉద్దేశపూర్వకంగా ఓ మహిళను పావుగా వాడుకుని కక్షసాధింపు చర్యలకు దిగారని ఆదిమూలం ఆరోపిస్తున్నారు. వీడియోలు మార్ఫింగ్ అని చెబుతున్నారు. టిడిపికి ఎపుడూ విధేయుడుగానే ఉంటానని, వాస్తవాలను అధినేతకు వివరిస్తానని చెప్పారు. పెద్దిరెడ్డిని వదిలే ప్రసక్తే లేదని చెబుతున్నట్లు తెలుస్తోంది. సత్యవేడు రేస్‌లో మాజీ ఎంఎల్‌ఎ ఎస్వీవీ నాయుడుకు బాధ్యతలు ఇస్తారని చర్చ నడుస్తోంది. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన రమేష్ శుక్రవారం మంత్రి లోకేష్‌ను కలిసి వరద బాధితుల నిధి 15 లక్షల చెక్కును అందజేశారు. ప్రస్తుతానికి కేసు నమోదు చేసిన పోలీసులు మాత్రం ఆదిమూలం అరెస్టుకు చట్టపరంగా సన్నాహాలు మొదలుపెట్టారని మాత్రం స్పష్టం అవుతోంది.

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ శాసనసభ్యుడు ఆదిమూలం తనను బెదిరించి లైంగికంగా వేధిస్తున్నారనే ఆరోపణలతో తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ మహిళ వీడియో, ఆడియో ఆధారాలతో రచ్చకెక్కడం తో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సష్టించిన విషయం తెలిసిందే. వివాదాల్లో చిక్కుకుని ఉండడంతో ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేస్తారనే ప్రచారం ఊపందుకుంది. అయితే ఇదంతా మార్ఫింగ్ వీడియో అని, తనపై కుట్ర పన్నారని ఆదిమూలం వాదించినా ఫలితం లేకపోయింది. ప్రాథమిక ఆధారాలతో ఆదిమూలం ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు ప్రకటించారు.

ఇదిలావుండగా శుక్రవారం ఆదిమూలం చెన్నైలోని అపోలో హాస్పిటల్ లో చేరారు. గుండెపోటుతో ఆయన చేరారని, ఆయనకు స్టంట్లు కూడా వేశారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. సాధారణంగానే గుండె సంబంధిత సమస్య ఉన్న ఆదిమూలం వివాదం రేగిన నేపథ్యంలో చికిత్స కోసం హాస్పిటల్ లో చేరారనే వాదన కూడా వినిపిస్తోంది.

రేపు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి -తిరుపతిటౌన్

భారత మాజీ రాష్ట్రపతి, దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి అందరినీ ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు, అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్. సరోజనమ్మ తెలిపారు. 8న ఆదివారం ఉదయం 11 గంటలకు నుండి తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించనున్న గురుపూజోత్సవం కార్యక్రమంలో జీవిత సాఫల్య బంగారు నంది పురస్కారాలు, ఎక్సలెన్సీ పురస్కారాలు, ఉత్తమ గురువు పురస్కారాలతో సత్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని), సినీ హీరో నరేన్ తేజ్ హాజరు కానున్నారని పేర్కొన్నారు.

గురుకులానికి బ్లీచింగ్ వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక కాసాగార్డెన్ బాలికల గురుకులానికి పలువురు దాతలు శుక్రవారం బ్లీచింగ్ వితరణ చేశారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ నిమిత్తం పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ భార్గవమూర్తి, పాత్రికేయుడు చుక్కల.సుబ్బారావు, రఘు గురుకుల్ ఏడాదికి సరిపడా రెండు బస్తాల బ్లీచింగ్ ను ప్రిన్సిపాల్ ప్రభావతికి అందజేశారు. విద్యార్థినుల ఆరోగ్యాన్ని దష్టిలో ఉంచుకుని గురుకులానికి స్వచ్ఛందంగా బ్లీచింగ్ వితరణ చేసిన దాతలకు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయులు రమాదేవి, అరుణ, సరస్వతి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతిటౌన్

వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో పర్యావరణ హితంగా ఉత్సవాలు జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి ఎంతో పవిత్రమైన పండుగ అని, పర్యావరణానికి హాని చేసే కత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాలను వాడరాదని, ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడేలా మట్టి వినాయకులని ఉపయోగించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు

వినాయక చవితి వేడుకల్లో భాగంగా నిర్వహించే నిమజ్జోత్సవానికి వినాయక సాగర్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం నగరపాలక సంస్థ, పోలీసు, ఫైర్, ఇతర విభాగాల అధికారులతో కలిసి వినాయక సాగర్ లో జరుగుతున్న ఏర్పాట్లను అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని చవితి వేడుకలను, నిమజ్జనాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి. రామకష్ణ ఆచారి, సి ఐ రామ్ కిషోర్, డి. ఈ. విజయకుమార్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ ఉన్నారు.

వచ్చే ఏడాది ఖైరతాబాద్ తరహా ఉత్సవాలు

శ్రీకాళహస్తి : వచ్చే ఏడాది శ్రీకాళహస్తిలో ఖైరతాబాద్ తరహా అతి పెద్ద భారీ వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి చవితి ఉత్సవాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. విజయవాడ వరద బాధితుల కోసం దాతల సహకారంతో రెండు కోట్ల విరాళాలు సేకరించి సీఎం సహాయ నిధికి పంపుతున్నట్లు తెలిపారు. స్థానిక లక్ష్మీ కామాక్షి కల్యాణ మండపంలో వినాయక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వెయ్యి గ్రామాలకు ఉచితంగా వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. వినాయక చారిటీ ట్రస్టు అధ్యక్షులు సురేందర్ రెడ్డి ప్రతి సంవత్సరం వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారనీ, ఆధ్యాత్మిక చింతన పెంపొందించే విధంగా నిస్వార్థంతో వినాయక ప్రతిమల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టిడిపి పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కట్టుకున్నోడే...కాలయముడై..

మంగళంలో మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మెట్టింట్లో కూతురు గౌరవంగా ఉండాలని ఇల్లు అమ్మి పెళ్లి చేశారు. తాళి కట్టినవాడు కడదాకా తోడు ఉంటాడని, కూతురిని బాగా చూసుకుంటాడని ఆశపడ్డ ఆ తల్లిదండ్రులకు కన్నీటి దుఃఖమే మిగిలింది. కట్టుకున్న వాడే కాలయముడై కాటేస్తాడని ఆ తల్లి గ్రహించలేదు. కాపురం అన్నాక చిన్నచిన్న గొడవలు రావడం సహజం... సర్దుకుపోవాలి తల్లి అని చెప్పి మళ్ళీ మళ్ళీ కాపురానికి పంపింది. 'అమ్మ నేను కాపురానికి వెళ్ళను... మా ఆయన నన్ను చంపేస్తాడు' అని భయం భయంగానే చెప్పింది రూపవతి... అయితే సోదరుడు కిషోర్, తండ్రి మార్కండేయులు ఇచ్చిన భరోసాతో ధైర్యంగా అమ్మగారి ఇల్లు తిరుపతి ఎస్ టి వి నగర్ నుండి అత్తగారిల్లు అయినా మంగళం క్వార్టర్స్‌కు కాపురానికి గురువారం వచ్చింది పిల్లలతో సహా వచ్చింది. మారిపోయాడన్న భర్త రమేష్ కాలయముడిగా మారాడని గుర్తించలేకపోయింది. వినాయక చవితి పండుగను బాగా చేసుకోవాలని ఇల్లంతా కడిగి శుభ్రం చేసింది. రాత్రి భోజనం తర్వాత పిల్లలతో కలిసి గదిలో పడుకుంది. భర్త నిమ్మనపల్లి రమేష్ వేరొక గదిలోకి రూపవతిని తీసుకెళ్లి చంపడానికి ప్రయత్నించగా వద్దు మామ చంపొద్దు అని రూపావతి బతిమాలుతుండగా.. ఆమె కేకలు విన్న పిల్లలు చందన ప్రియ, కుందన ప్రియలు 'డాడీ వద్దు...అమ్మని చంపొద్దు' అని అరిచినా రమేష్ లోని క్రూరత్వం ముందు వారి బతిమాలే కేకలు పనిచేయలేదు. ఇంటిలో వాడే కత్తి తీసుకొని ఆమె గొంతు కోశాడు... అయినా అతని ఆవేశం చల్లారక మెడ చుట్టూ... ఛాతిపై కత్తితో విచక్షణ రహితంగా పొడిచాడు. రూపావతి చనిపోయింది అని నిర్ధారించుకున్న హంతకుడు రమేష్ ఆ కత్తి పట్టుకుని వీధుల్లోకి వచ్చి గట్టిగా అరుస్తూ హంగామా చేసి పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. శుక్రవారం మంగళం క్వార్టర్స్ లో రమేష్ నివాసం వద్ద భయానక వాతావరణం ఏర్పడింది. కట్టుకున్న భార్యను కడతేర్చాడని రమేష్ పై స్థానికులు, రూపావతి బంధుమిత్రులు శాపనార్థాలు పెడుతూ... కాపురానికి వెళ్ళనమ్మా అని అన్నరూపావతిని అక్కడే ఉంచి ఉంటే ప్రాణాలతోనైనా ఉండేది కదా అని వారి తొందరపాటు నిర్ణయాన్ని గుర్తు చేసుకున్నారు. హంతకుడు రమేష్ ను కఠినంగా శిక్షించాలని.. బయటికి విడిచి పెట్టొద్దని ఏ ఎస్ పి మనోహరాచారిని రూపావతి తల్లిదండ్రులు ప్రాధేయపడ్డారు. ఏఎస్పి రవి మనోహరాచారి మీడియాతో మాట్లాడుతూ చట్టపరంగా హంతకుడుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూపవతి మతదేహాన్ని పోస్టుమార్టం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ హత్యపై తిరుచానూరు పోలీస్ స్టేషన్ సీఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలతో రూపవతి (ఫైల్‌ఫోటో)

10 నుంచి 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఈ నెల 10వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా " పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావుతో కలిసి గోడపత్రికను శుక్రవారం విడుదల చేశారు. రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఈ వ్యవసాయ విస్తరణ కార్యక్రమం అని, రైతులకు నూతన సాంకేతిక పద్ధతులను తెలిపి, వారికి సంబంధించిన పొలాల సంరక్షణ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడి వచ్చే విధంగా చేపట్టాల్సిన మెలకువలపై వారికి సూచనలు సలహాలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి వారం మంగళ, బుధవారాల్లో ఉంటుందన్నారు.

వ్యవసాయ అధికారులతో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

వరద బాధితులకు డాలర్స్ గ్రూప్ రూ.10 లక్షలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

విజయవాడ వరద బాధితుల సీఎం సహాయ నిధికి డాలర్స్ గ్రూప్స్ అధినేత డాలర్స్ దివాకర్ రెడ్డి 10 లక్షల చెక్కును శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో ప్రకటించారు. తిరుపతి ప్రెస్క్లబ్లో శుక్రవారం మీడియా ముందు చంద్రగిరి నియోజకవర్గంలోని టిడిపి నాయకులతో కలిసి దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గంటల వ్యవధిలోని విజయవాడ మొత్తం వరదలతో మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులలోనే ప్రతి ఒక్కరూ మానవత్వాన్ని చాటి బాధితులకు సహాయం చేయాలని కోరారు.. సీఎం చంద్రబాబు 75 ఏళ్ల వయసులో దాదాపు 30 నిమిషాలు జెసిబి లో ప్రయాణం చేసి వరద బాధితులకు సేవ చేయడానికి నడుం బిగించడం హర్షనీయమన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర ప్రయోజనాల కోసం సేవ చేయడానికి చంద్రగిరి నియోజకవర్గం ఎప్పుడు ముందుంటుందని తెలియజేశారు.

మెప్మా ఆధ్వర్యంలో రూ.36 లక్షలు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం తిరుపతి, చిత్తూరు మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్ మెప్మా ఆధ్వర్యంలో 36 లక్షల 14 వేల 78 రూపాయలు చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్ కింద శుక్రవారం పంపారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.

వరద బాధితులకు సిపిఎం సహాయ నిధి సేకరణ

రేణిగుంట : విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి రేణిగుంట మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. నిధి వసూళ్లు మొత్తం 18,630 రూపాయలను సిపిఎం పీపుల్స్ రిలీఫ్ ఫండ్ అకౌంట్‌కు పంపినట్లు మండల కార్యదర్శి కె.హరినాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. నిధి సేకరణలో నాయకులు వెంకటరమణ, సెల్వరాజ్, దిలీప్ భాష, కుప్పస్వామి, రాజశేఖర్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కేంద్రం రూ.5వేల కోట్లు సాయం చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

విజయవాడ వరదల్లో కొట్టుమిట్టాడుతుంటే చంద్రబాబునాయుడు కష్టపడుతున్నాడని, దేశ ప్రధాని సరదాగా సింగపూర్‌లో షికార్లు కొడుతున్నాడని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఎద్దేవా చేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు కేంద్రం రూ.5వేల కోట్ల సాయం చేయాలని డిమాండ్ చేశారు. మన్నవరం బెల్ ఫ్యాక్టరీ, అంతర్జాతీయ విమానాశ్రయం, శ్రీకాళహస్తి -నడికుడి రైల్వే లైన్, దుగరాజపట్నం ఓడరేవు సాధించి పెట్టామని, అయితే మన ప్రాంతం అభివృద్ధి కావడం బిజెపికి ఇష్టం లేదని, ప్రాజెక్టులన్నీ వెనక్కి పోయాయన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు నరేంద్రనాయుడు, రావణ్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: సీఐ

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ ఆయా గ్రామాల్లోని ఉత్సవ కమిటీ సభ్యులకు ఏర్పేడు సీఐ జయచంద్ర ఆదేశించారు.

పట్టు పరిశ్రమ పెంపకం షెడ్డు పరిశీలన

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని గణేశ్వరపురం పంచాయతీలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్, సెరికల్చర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్మించిన పట్టు పురుగుల పెంపకం షెడ్డును కేంద్ర డిప్యూటీ కార్యదర్శి ఆశిష్ గుప్తా శుక్రవారం పరిశీలించారు. గణేష్ పురం గ్రామంలో ఈశ్వర్ ప్రసాద్ నాయుడు పట్టు పురుగుల పెంపకంపై ఆసక్తితో ఉపాధి హామీ, పట్టు పరిశ్రమల శాఖ మంజూరు చేసిన మూడు లక్షల రూపాయలతో షెడ్ లో అద్భుతంగా నిర్మించుకున్నారు. ఈ షెడ్డు నిర్మాణాన్ని రాష్ట్ర ఉపాధి హామీ జాయింట్ కమిషనర్ శివ ప్రసాద్ పరిశీలించి రైతులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టు రైతులు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆశీస్సు గుప్తా, శివప్రసాదు రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, ఏపీడీ పద్మాలత, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో హంస వేణి, జేఈఈ మమత పాల్గొన్నారు.

ఐక్యతతో అభివృద్ధిని సాధించాలి

- ఏపీ ఎస్పిడిసిఎల్ ఎస్ఈ

ప్రజాశక్తి క్యాంపస్ : ఏదైనా ఒక సంఘం స్థాపించినప్పుడు అందులోని సభ్యులు, ఇతరులు ఆ సంఘం అభివృద్ధి కోసం ఐక్యతతో పనిచేసి అందరి మన్ననలు పొందాలని ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఎం దేవేంద్ర నాథ్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎలక్ట్రాన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ఈ ఈ విభాగం ప్రత్యేక సంఘం ప్రారంభోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ ఈ విభాగం సంఘాన్ని ప్రారంభించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, సంబంధిత విభాగం పూర్వ విద్యార్థులు, పరిశోధకులు కార్యక్రమాలలో పాల్గొని ఐక్యత ద్వారా వివిధ ప్రయోజనాలను పొందాలని సూచించారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ మల్లికార్జున, ఆచార్య విసి వీరారెడ్డి, కోఆర్డినేటర్, ప్రెసిడెంట్ డాక్టర్ డి హిమబిందు, ఉపాధ్యక్షురాలు డి నిర్మిత కార్యదర్శి పూజశ్రీ, జాయింట్ సెక్రటరీలు జి జస్వంతి, కే సింధు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం అధ్యాపకులు డాక్టర్ కే హైమావతి పెరుమాళ్లపల్లిలో హెచ్‌పివి టీకాపై, క్యాన్సర్ నివారణపై స్వయం సహాయక సంఘాలకు శుక్రవారం అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రుతుచక్రం అంటే ఏమిటి? ఆ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. అమ్మాయిలు వయసుకు వచ్చాక మొదలయ్యే రుతుచక్రం కొన్ని సంవత్సరాలు పాటు ఉంటుందన్నారు. ఈ సమయంలో ఖచ్చితమైన జాగ్రత్తలు, మంచి ఆహార అలవాట్లు అలవర్చుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

టిడిపి యాప్ టాప్ స్కోరర్‌లకు అభినందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: టీడీపీ యాప్ ద్వారా పార్టీ కంటెంట్ ను ప్రజల్లోకి తీసుకెళ్లి టాప్ స్కోర్‌లో నిలిచిన వారికి నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తమ కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పంపించిన ప్రశంసా పత్రాలు అందుకున్న పుత్తూరు టౌన్ టిడిపి కోఆర్డినేటర్ 20వ వార్డు యూనిట్ ఇన్‌ఛార్జి యం ఈశ్వర్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జి జీవరత్నం నాయుడు , ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్ పాల్గొన్నారు.

రూ.కోటి విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పోలీసుల అదుపులో వున్న ఎర్రచందనం స్మగ్లర్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల నుండి అక్రమంగా కోటి రూపాయల విలువ గల ఎర్రచందనం దుంగలను ప్రైవేట్ కంపెనీ కంటైనర్ ముసుగులో తరలి స్తుండగా చెన్నై-నెల్లూరు జాతీయ రహదారిపై టాస్క్ ఫోర్స్ అధికారులు వాహన తనిఖీలలో గుర్తించి ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. టాస్క్ ఫోర్స్ ఆర్ ఐ సురేష్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం గురువారం మధ్యాహ్నం చెన్నై-నెల్లూరు జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా తడ మండల ప్రభుత్వ హాస్పిటల్ ఎదురుగా రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీలు చేశారని అధికారులు తెలిపారు. ఓ కంటైనర్ వాహనం వాహన తనిఖీలను గమనించి వాహనం విడిచిపెట్టి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసు కొని, కంటైనర్ తాళం తెరచి అందులో పరిశీలించగా వ్యవసాయ పరికరాల నడుమ 143 ఎర్ర చందనం దుంగలు తరలిస్తున్నట్లుగా గుర్తించా మన్నారు. ఈ ఘటన లో ఐదుగురు ఎర్ర చందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకు న్నామని, పట్టుబడ్డ స్మగ్లర్లలో ఒక వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదయి వుందని, 20 ఎర్ర చందనం కేసులలో నిందితుడుగా ఉన్నాడని తెలిపారు. వీరంతా తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించామ న్నారు. ఈ ఎర్రచందనం, కంటైనర్, కారు స్వాధీనంపై టాస్క్ ఫోర్సు పోలీస్ స్టేషన్లో కేసు నమోదయిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న 143 ఎర్రచందనం దుంగలు 1664 కేజీలు వుంటుందని, ఈ ఎర్రచందనం తరలింపు వెనుక ఉన్న వారి కోసం ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్సు బృందానికి రివార్డులను ప్రక టించారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసు ఛేదింపు

నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -రామచంద్రపురం (పాకాల): మూడు నెలల క్రితం చోటుచేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి హత్యకేసులో నిందితుడిని పాకాల పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పాకాల సిఐ కె మద్దయ్యాచారి పాకాల పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎస్‌పి సుబ్బరాయుడు, చంద్రగిరి డిఎస్‌పి నర్సింగప్పలు మూడు నెలల క్రితం పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటుచేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసును ఛేదించారని తెలిపారు. ఉప్పరపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ఓ వ్యక్తి తిరుగుతుండగా విచారించి అరెస్టు చేశామని పేర్కొన్నారు. నిందితుడు పాకాల మండలం, రాజీవ్ కాలనీ దామలచెరువుకు చెందిన డి చంద్రశేఖర్(32) తండ్రి దొరై భాస్కర్‌గా గుర్తించామని తెలిపారు. చంద్రశేఖర్ జులాయిగా తిరుగుతూ మోటార్ సైకిళ్లను దొంగలించే మదనపల్లికి చెందిన శవాల భాస్కరయ్య కొడుకు సూర్యప్రకాష్ అలియాస్ రాఘవతో స్నేహం ఏర్పరచుకొని తిరిగేవాడని తెలిపారు. ఇతను తాగుడుకు అలవాటు పడి భార్య పిల్లలకు దూరమై దేశ దిమ్మరిగా తిరుగుతుండేవాడని ఈ ఏడాది జూన్ 11వ తేదీ సూర్య ప్రకాష్ చంద్రశేఖరులు మద్యం తాగి వెంకట్రాయని చెరువు వద్ద వున్న బావిలో స్నానం చేసిన తర్వాత మూడువేల రూపాయలు అప్పు కోసం గొడవ పడుతుండగా సూర్యప్రకాష్ బీరు బాటిల్ తో చంద్రశేఖర్ పై దాడి చేశాడు. కోపోద్రికుడైన చంద్రశేఖర్ తప్పించుకుని అక్కడ ఉన్న ఇటుక రాళ్లతో కొట్టి, కిందపడిన సూర్య ప్రకాష్ లేస్తే తనను చంపుతాడని పెద్దరాయితో తలపై మోది హత్య చేశాడని పేర్కొన్నారు. చనిపోయిన సూర్యప్రకాష్ పై గతంలో తిరుపతిలో మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులు ఉన్నాయని, మదనపల్లిలో తన తండ్రిపై హత్యాయత్నం చేసిన కేసు కూడా నమోదై వుందని పేర్కొన్నారు. హత్యకు పాల్పడ్డ నిందితుడిని రిమాండ్ కు తరలించారు. ఈ హత్య కేసు ఛేదింపులో పాకాల ఎస్ఐ మహేష్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

భవన నిర్మాణ కార్మికుడిపై హత్యాయత్నం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: భవన నిర్మాణ కార్మికుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన తిరుమల కౌస్తుభం అతిథిగృహం సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పీలేరుకి చెందిన ఉదయ్ కిరణ్ అనంతపురానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు నరసింహతో ఘర్షణకు దిగి కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గంజాయి మత్తులో దాడి చేసినట్లు పేర్కొన్నారు. గాయపడిన నరసింహ పరిస్థితి విషమంగా వుందని తెలిపారు. చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించామన్నారు. నిందితుడు పీలేరుకి చెందిన ఉదయ్ కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని టూటౌన్ పోలీసులు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి -నాయుడుపేట: రేషన్ బియ్యాన్ని తమిళనాడుకు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేశామని సీఐ ఎం బాబీ తెలిపారు. సీఐ కథనం మేరకు..నాయుడుపేట పట్టణ పరిధి లోని ఎన్ హెచ్ 16 హైవే వద్ద వున్న కేఎంఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఏపీ 26 టీ ఎఫ్ 3618 నెంబర్ కలిగిన లారీలో రాజమహేంద్రవరం రాజనగరం నుండి చెన్నై కు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం 30 టన్నుల (30వేల కేజీలను) నాయుడుపేట తన సిబ్బందితో పట్టుకున్నామని తెలిపారు. లారీని స్వాధీనం చేసుకుని నాయుడుపేట సిఎస్ డిటి బి ఓబయ్య అప్పగించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

దౌర్జన్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-తిరుపతి సిటి :

తిరుపతికి చెందిన రౌడీ షీటర్ సాయి ఈనెల 4వ తేదీ పరసాల వీధిలో ఉంటున్న పీటర్ పార్థు ఇంటికెళ్లి అతని భార్య లక్ష్మితో అసభ్యంగా ప్రవర్తిం చాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు సాయిపై వెస్ట్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు దుకాణాలు దగ్ధం

రూ.మూడు లక్షలు పైన ఆస్తి నష్టం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి సమీపంలో గురువారం రాత్రి హఠాత్తుగా దుకాణాలకు నిప్పంటుకుని మూడు లక్షల రూపాయలకు పైగా ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు లక్ష్మిదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలు కథనం మేరకు.. బైరెడ్డి పల్లి చెక్ పోస్టు సర్కిల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు భాగంలో పలమనేరు - కుప్పం మెయిన్‌రోడ్డులో రేకులషెడ్డులో చెప్పుల దుకాణం పెట్టుకొని జీవిస్తున్నామని గురువారం రాత్రి 9గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లామని తెలిపారు. తరువాత అర్ధరాత్రి సుమారు 1.30 గంటల సమయంలో తమ దుకాణానికి పక్కనే చిల్లర దుకాణం పెట్టుకున్న మస్తాన్ తమకు ఫోను చేసి 'మీ దుకాణం కాలిపోతోందని సమాచారం అందించాడని తెలిపారు. దీంతో తన భర్త దుకాణం వద్దకు వెళ్లగా, దుకాణం కాలిపోతోందని పలమనేరు - అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించామన్నారు. ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసి ఆర్పారని తెలిపారు. తమ దుకాణానికి పక్కనే వున్న కొయ్యల బంక్ వేమన్న కుమారుడు రెడ్డెప్ప దుకాణం బాడుగల పూలదుకాణం పెట్టుకొని యున్న ధర్మపురి గ్రామానికి చెందిన రామక్రిష్ణప్ప కుమారుడు, కన్నప్ప బంకు, పూల దుకాణం మొత్తం పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో తమ దుకాణంలోని, ఫర్నిచర్ ఉమా గోల్డ్ సెట్టు మొత్తం సుమారు 1లక్షా 10వేలు సరుకు కాలి నష్టం ఏర్పడిందన్నారు. కన్నప్ప కొయ్యల బంకు, పూలు, పూలు తూకం వేసే కాట్రా మొత్తం కాలి వారికీ 40 వేలు రూపాయలు నష్టం కలిగిందని తెలిపారు. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లా, లేక ఆకతాయిల కారణమా తెలియడం లేదన్నారు. దీనిపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ హెచ్ ఓ చలపతి స్పందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

దుకాణాలకు నిప్పంటుకుని దగ్ధమవుతున్న దృశ్యం

క్రీడలను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలి : విసి

ప్రజాశక్తి - క్యాంపస్ :

క్రీడలను ప్రతి విద్యార్థి, ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని తద్వారా ఎన్నో రకాల వ్యాధుల నుండి బయట పడవచ్చని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు తగిన వ్యాయామం లభిస్తుందని తద్వారా ఇటీవల వచ్చే గుండెపోటు, బిబి, షుగర్ వంటి వాటిని సమర్థవంతంగా నివారించేందుకు వ్యాయామం ఒక ఔషధంగా పనిచేస్తున్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ వ్యాయామ విభాగ విభాగం వారు వర్సిటీలోని అన్ని విభాగాల విద్యార్థులతో క్రీడలు, ఇతర వ్యాయామ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ వారిని క్రీడల్లో భాగస్వామ్యం చేసేలా కృషి చేయాలని సూచించారు. టీటీడీ ఎస్వీఎస్సిఓ రామ్ కుమార్ మాట్లాడుతూ ఎస్వీయూలో సింథటిక్ టెన్నిస్ ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులం,తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మట్టి వినాయకుడిని ఏర్పాటు చేసుకొని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య తెలిపారు. వినాయక చవితిని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బొటనీ డిపార్ట్మెంట్ "గో గ్రీన్ విత్ మట్టి గణేశ" అనే పేరుతో ఎకో ఫ్రెండ్లీ వినాయక చవితి పూజతో పాటు వినాయకునికి సమర్పించే 21 రకాల పత్రుల వైద్య విలువలతో ఒక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి వినాయకుడిని ప్రతిమను వివిధ రకాల విత్తనాలతో మట్టి వినాయకుడిని రూపొందించి 21 రకాల పత్రి ని సమర్పించి పూజించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి కోటేశ్వ రయ్య జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ వినాయక చవితి ప్రకృతి ఆరాధనను నేర్పిస్తుందని ప్రకృతి నుండి ఔషధ గుణాలను వివరిస్తుందన్నారు ఇందులో భాగంగా 21 రకాల పత్రిని విద్యార్థులు ప్రదర్శిస్తూ వాటి ఔషధ గుణాలను సందర్శకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బొటనీ డిపార్ట్మెంట్ అధ్యాపకులు పద్మావతి, డాక్టర్ సుజన, , డాక్టర్ కోటేశ్వరరావు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం..

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మట్టి విగ్రహాన్ని వినియోగించి, పర్యావరణాన్ని కాపాడదామని ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ నరేంద్రబాబు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తిరుపతి సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఏ నరేంద్రబాబు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ అశోక్ కుమార్ వినాయక చవితి పండుగ -2024 సందర్భంగా పర్యావరణహిత పండుగ జరుపుకునే నిమిత్తమై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించి మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయ సిబ్బంది, పట్టణ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

IN THE COURT OF THE
III ADDITIONAL JUNIOR CIVIL
JUDGE : : TIRUPATI
O.S. No. 1076 OF 2023

Between:
Bellamkonda Srinivasa **...Plaintiff**
And
Seshagiri Phani Kumar Natu **...Defendant**

SUMMONS TO DEFENDENT

Seshagiri Phani Kumar Natu, S/o Natu Seshagiri Rao, D.No.19-12-94, Sannidhi Street, Tirupati, Tirupati District.

Take Summons that the Plaintiffs filed the Suit against you in the above O.S.No.1076 of 2023, Suit stands posted to dt.20.09.2024 for your appearance. Hence you are required to appear before the above court on the aforesaid date on 10.30 a.m. onwards either in person or through an advocate and file your objections or else the matter will be decided as exparte and the case will be proceeded in your absence.

Hearing Date: 20.09.2024

KANCHI SHAMALA,
B.V.HARICHANDANA,
ADVOCATES, TIRUPATI.

ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు: ఎమ్మెల్యే

కూలిన బ్రిడ్జి స్థంభాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు కోర్టు సెంటర్ వద్ద బ్రిడ్జి స్తంభాలు కూలిపోయాయి. దీన్ని దృష్టిలో వుంచుకుని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటా మని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నా రు. పట్టణంలోని కోర్టు వద్ద స్తంభాలు కూలిన ప్రదేశాన్ని ఎమ్మెల్యే ఆర్అండ్‌బి, పోలీస్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో టిప్పర్లు అశోక్ నగర్ అండర్ బ్రిడ్జ్ వద్ద రాకపోకలు సాగించడంతో నిరంతరం ట్రాఫిక్ స్తంభించి తీవ్ర ఇబ్బంది కలిగిస్తోందని టిప్పర్లు అంబేద్కర్ నగర్ అండర్ బ్రిడ్జి వైపు రాకపోకలు సాగించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించామని తెలిపారు. అంబేద్కర్ నగర్ అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోకుండా రెండు రోజుల్లో మున్సిపల్ ఆర్అండ్‌బి, రైల్వే అధికారులు పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ శేఖర్ బాబు, నాయకులు గురవయ్య, బిల్లు చెంచురామయ్య, రహీం, వెంకటేశ్వర్ రాజు, శివకుమార్ పా ల్గొన్నారు.

భూమి, ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

తహశీల్దారుకు పేదల వినతి

తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న కేశవరం గ్రామస్తులు

ప్రజాశక్తి -కోట : తమకు భూమి లేని వారికి భూమి, ఇంటి నివాస స్థలాలు మంజూరు చేయాలని కేశవరం గ్రామస్తులు తహశీల్దారు కె జయ జయ రావుకు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేశవరం పంచాయతీలో 193వ సర్వే నంబర్‌లో 112 ఎకరాలు భూమిని కొంత మంది ఆక్రమించుకున్నారని, మిగిలిన కొంత భూమి ఖాళీగా ఉందని, అందులో కేశవరం పంచాయతీకి చెందిన పలు భూమిలేని నిరుపేద కుటుంబాలకు భూమిని, నివాస స్థలాలను మంజూరు చేయాలని తహశీల్దారును కోరామని తెలిపారు. తమకు ఎలాంటి ఆస్తులు లేవని కూలి పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. కేశవరంలోని భూమిని పరిశీలించి అందరికీ అందేలా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని తహశీల్దారుకు తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చాపల శ్రీనివాసులు, నాగూర్, వేణు, శ్రీనివాసులు, కేశవరం గ్రామస్తులు పాల్గొన్నారు.

దాతల చేయూత అభినందనీయం: ఎమ్మెల్యే

వరద బాధితుల సహాయ చెక్కును అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వరద బాధితులకు దాతల చేయూత అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. విజయవాడ వరద బాధితులను ఆదుకు నేందుకు గూడూరులో పలు అసోసియేషన్లు తమ వంతుగా ఆర్థిక సహాయ చెక్కులను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు శుక్రవారం అందించారు. గూడూరు పట్టణ సమీపంలోని బాలాజీ లెమన్ మార్కెట్ కార్యాలయంలో ఎమ్మెల్యేకు వరద బాధితుల సహాయార్థం మార్కెట్ అసోసియేషన్ తరపున రెండు లక్షల రూపాయల చెక్కును, బిల్డిన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.50 వేల చెక్కును, టిడిపి చిట్టమూరు మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు రూ.లక్ష యాభై వేల చెక్కును ఎమ్మెల్యేకి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సాయం ఎంతో అభినందనీయమన్నారు. తన వంతు సాయంగా రెండు, మూడు రోజుల్లో 5 లక్షల రూపాయల విలువగల బ్లాంక్ కిట్స్ తీసుకువెళ్లి అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలమంచి సిద్దారెడ్డి, పెంచలయ్య, మస్తాన్ నాయుడు ,వెంకటేశ్వరరాజు ,బాలకృష్ణ రాజు, పులిమి శ్రీనివాసులు పాల్గొన్నారు.

'పంట నమోదును పూర్తి చేయాలి'

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఉద్యాన అధికారి దశరథ రామిరెడ్డి, జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి సతీష్ అధికారులకు సూచించారు. దిగువార్లపల్లిలో రైతు సేవా కేంద్రంలో చిన్నగొట్టిగల్లు రైతు సేవా కేంద్ర సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపంట నమోదు పూర్తి చేయాలని, సూక్ష్మ నీటిపారుదల పథకంలో డ్రిప్పు, స్ప్రింక్లర్లు వేసుకున్న రైతుల వివరాలు ఈ పంటలో నమోదు వంటి విషయాలపై సమీక్షించారు. అనంతరం దగ్గరలోని టమాటా సాగును పరిశీలించారు. ఈనెల 15 వ తేదీలోపు మిగిలిన మామిడి, టమోటా, ఇతర పంటలన్నీ ఈ పంటలో నమోదు పూర్తి చేయాలని సూచించా రు. ఎక్కడా నమోదు కాని పంటలు వుండకూడదని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శివకుమారి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

హామీలకే పరిమితం..

- సిబ్బంది లేని రాయలచెరువు కట్ట పోలీసు అవుట్ పోస్ట్ - ప్రజలకు రక్షణ కరువు

రాయలచెరువు కట్టపై నిరుపయోగంగా ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్ షెడ్

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రామచంద్రాపురం మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయల చెరువు కట్టపై అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులు ఇస్తున్న హామీలు అమలు కావడంలేదు. అవుట్ పోస్ట్ ఏర్పాటు మండల ప్రజలకు అందని ద్రాక్ష గానే మిగిలిపోతోంది. 2016 వ సంవత్సరంలో అప్పటి తిరుపతి అర్బన్ ఎస్‌పి గోపీనాథ్ జెట్టి రాయల చెరువును సందర్శించిన నేపథ్యంలో మండల ప్రజలు రాయల చెరువు కట్టపై పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో అప్పటి ఎస్‌పి గోపీనాథ్ జెట్టి స్పందించి అవుట్ పోస్ట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కానీ కార్యరూపం దాల్చలేదు. రాయలచెరువు కట్ట మార్గం ద్వారా డ్వాక్రా మహిళలు, రైతులు, వ్యాపారులు కుప్పం బాదూరు గ్రామంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఆర్థిక లావాదేవీలు నిర్వహించేందుకు ద్విచక్ర వాహనాలలో వస్తారు. ఇదే సమయంలో దారి దోపిడీ దొంగలు, చైన్ స్నాచర్లు రాయల్ చెరువు కట్టపై దోపిడీలకు పాల్పడి మహిళల మెడలోని బంగారు చైన్లు, నగదును దోచుకున్న సంఘటనలు చాలా చోటుచేసుకున్నాయి. అంతే కాకుండా రాయల చెరువు కట్ట అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారి మహిళలు, యువతులు హత్యకు గురైన సంఘటనలు చాలా చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కుప్పం బాదూరు బ్యాంకుకు వెళ్లాలంటే మహిళలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయం 2021 వ సంవత్సరంలో అప్పటి ఎస్‌పి వెంకట అప్పలనాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన రాయల చెరువు కట్టపై స్థానిక దాతల సహకారంతో షెడ్డు నిర్మించి అవుట్ పోస్ట్ ను ఏర్పాటు చేశారు. పోలీసులు కొంతకాలం పోలీస్ అవుట్ పోస్టులో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరేసి పురం పోలీసులు విధులు నిర్వహించారు. గత కొంతకాలం నుండి రాయల చెరువు కట్టపై ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్ షెడ్‌లో పోలీసులు విధులు నిర్వర్తించకపోవడంతో ఆ షెడ్డు నిరుపయోగంగా మారింది. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి రాయల చెరువు కట్టపై ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్ కు పోలీసులను ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అవసరం వుంది. ప్రస్తుతం రాయలచెరువు కట్టపై మందుబాబులు బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగి రోడ్లపై వెళ్లే ప్రజలపై దాడులకు పాల్పడుతున్నారు. తిరుపతి నగరంలో గంజాయి, డ్రగ్స్‌పై పోలీసు అధికారులు ఉక్కు పాదం మోపడంతో గంజాయి బ్యాచ్ రాయలచెరువు కట్టపైకి వచ్చి గంజాయి, డ్రగ్స్‌ను సేవించి ప్రజలపై వీరంగం చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాయల చెరువు పోలీసు అవుట్ పోస్టుకు పోలీసులను ఏర్పాటుచేసి మహిళలకు, స్థానికులకు రక్షణ కల్పించాల్సి వుంది.

సిబ్బంది కొరత వల్లే నిరుపయోగం: ఎస్ఐ

ప్రస్తుతం రామచంద్రాపురం పోలీసు స్టేషన్‌లో తగినంత మంది సిబ్బంది లేని కారణంగానే రాయల్ చెరువు పోలీసు అవుట్ పోస్టు షెడ్‌కు పోలీసులను నియమించలేకపోతున్నాం.. దీనిపై తగినంత మంది సిబ్బంది వచ్చిన వెంటనే పోలీసు అవుట్ పోస్ట్‌లో సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటాం..

- రామాంజనేయులు, రామచంద్రాపురం ఎస్ఐ.

పండుగను ప్రశాంతంగా నిర్వహించాలి: డిఎస్‌పి

ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డిఎస్‌పి రమణకుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించు కోవాలని గూడూరు డిఎస్పీ రమణ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఉన్న రోటరీ భవన్‌లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో డిఎస్‌పి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కమిటీ సభ్యులకు పలు సూచనలు , సలహాలు అందించారు. ఈ సమావేశంలో సిఐలు కిషోర్‌బాబు, శేఖర్‌బాబు, శ్రీనివాస్, ఎస్ఐలు శ్రీహరిబాబు , మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఐని సత్కరిస్తున్న వైసిపి నాయకులు

అధికారులను కలిసిన వైసిపి నేత

ప్రజాశక్తి - ఓజిలి : ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహశీల్దారు పద్మావతి, ఎస్ఐ స్వప్నను వైసిపి సీనియర్ నాయకులు, మనమాల గ్రామ ఉప సర్పంచి ఉచ్చూరు హరినాథ్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో వెంకటరమణ రెడ్డి, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

ఉత్తమ అవార్డులు అందుకుంటున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా తిరుపతి కలెక్టర్ వెంకటేష్ చేతుల మీదుగా పిచ్చాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరి ప్రకాష్ , పిచ్చాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు రమేష్ బాబు, పిచ్చాటూరు ఎంపిపి స్కూలు ఉపాధ్యా యులు మదన్ ముసాయర్ ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భం గా పలువురు ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథి మయూరి శ్యామ్ యాదవ్

బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకృష్ణ సేవ సమితి అధ్యక్షులు శ్రీ సరస్వతి శిశు మందిరం సహాయ కార్యదర్శి మయూరి శ్యామ్‌యాదవ్ పాల్గొని ఉపాధ్యాయులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ తల్లిదండ్రులను గౌరవించిన విధంగానే గురువుల్ని గౌరవించి క్రమ శిక్షణతో కూడిన విద్యను గురువుల నుండి నేర్చుకుని తద్వారా ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మురళీ నాయుడు, సనత్ కుమార్ రెడ్డి, రవిచంద్రారెడ్డి, ప్రధానాచార్యులు రంగనాయకులు, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముందస్తు వినాయక చవితి వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నెల్లటూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ముందస్తు వినాయక చవితి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యా యులు రామయ్య మాట్లాడుతూ గతంలో పిల్లలు గ్రామంలోని చెరువు నుండి గుంటల నుండి మట్టిని తెచ్చి వినాయక విగ్రహాలు తయారుచేసి పూజలు చేసే వారన్నారు. కానీ వేగవంతమైన పట్టణ జీవన శైలి కారణంగా వినాయక విగ్రహాలను మార్కెట్లో కొనుగోలు చేసి పండుగ కోసం ఉపయోగించడం మామూలు అయిపోయింది కానీ ఈ విగ్రహాలు తయారీకి ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఇతర రసాయనాలు పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయన్నారు. నిజానికి మన పూర్వీకులు పాటించే సంప్రదాయంలో మట్టి గ్రహాలు తయారీ వల్ల పిల్లలకు నైపుణ్యాలు కలుగుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టితో తయారు చేసిన విగ్రహాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శేషాద్రి రాజు, బాబు, రమేష్, హిమబిందు, కేవలక్ష్మి దేవి, మనోరమ, విజయ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు వినాయక చవితి వేడుకలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం మట్టి వినాయకుడిని నెలకొల్పి పూజలు చేశారు. పర్యావరణానికి హాని లేకుండా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించాలని, ఆ మేరకు విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ శారద అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజలకు సూచించి మట్టి వినాయకుడికి పూజలు చేసేలా చూడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమాన్ని డాక్టర్ వెంకటేష్, డాక్టర్ అరుణ, డాక్టర్ మంగళ గౌరీ తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్సిసి ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి గణపతిని తయారు చేయడం, పూజించడం వల్ల కలిగే ప్రయోజనాలు మీద విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల విద్యార్థులు స్థానిక చెరువు నుంచి మట్టిని సేకరించి వినాయక విగ్రహాన్ని తయారుచేసి పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిలో మమేకమవుతూ నేల, నీరు, చెట్టు, పుట్ట తదితర ప్రకృతి శక్తులన్నింటినీ ఆరాధించడం మన సంస్కృతిలో భాగంగా కొనసాగుతుందని, ఇది మన భారతీయ సంస్కృతి గొప్పదనం అని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ బాబు, కార్తీక్, జోగి ప్రసాద్, మీనా తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు విజయం స్కూల్‌లో

చిత్తూరు అర్బన్: స్థానిక సుందరాజపురం విజయం పాఠశాలలో శుక్రవారం వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. జన్మవృత్తాంతం నాటికి పలువుర్ని ఆకట్టుకుంది. వినాయకచవితి ప్రాధాన్యతను పాఠశాల కార్య నిర్వాహణ అధ్యక్షులు డాక్టర్ శైలజమూర్తి విద్యార్థులకు వివరించారు. విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి ఉపాధ్యాయులు, విద్యార్థులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కౌలస్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్తూరు హార్వెస్ట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల

చిత్తూరు అర్బన్: స్థానిక రామ్‌నగర్ కాలనీలోని హార్వెస్ట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో జేఎంసి శివకుమార్, నగర పాలక సంస్థ కో-అప్షన్ సభ్యులు కోలా కిరణ్, స్థానిక కార్పోరేటర్ పూర్ణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. వినాయక చవితి తెలుగు పండుగల ప్రాధాన్యతను పాఠశాల కరెస్పాండెంట్ భాస్కర్ విద్యార్థులకు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగరాజుకు డాక్టరేట్ ప్రదానం

నాగరాజ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ద్రావిడ విశ్వవిద్యాలయం కన్నడ, అనువాద అధ్యయన శాఖలో పరిశోధన చేస్తున్న బి.నాగరాజుకు పిహెచ్‌డి పట్టా ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కన్నడ శాఖలోని ఆచార్యులు జయలలిత పర్యవేక్షణలో 'కో చెన్నభసవ్వనవరా కాదంభారిగలు: ఒందు' అధ్యయన అన్న అంశంపై సమర్పించిన పరిశోధ సిద్ధాంత గ్రంథానికి గాను ఆయనకు పిహెచ్‌డి పట్టాను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ బోధన బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

వరద బాధితులకు కానిస్టేబుల్ సాయం

చెక్కును అందిస్తున్న కానిస్టేబుల్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వరద బాధితులకు తన వంతు సాయంగా ఎస్‌బి హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ తన వంతు సాయం గా రూ.25వేల చెక్కును ఎస్పీ మణికంఠ చందోలుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మురళీ కృష్ణని ప్రశంసిస్తూ, "మీరు చూపించిన సేవాభావం అందరికీ ఆదర్శప్రాయంగా నిలవాలి" అని కితాబు ఇచ్చారు.

'శిలాఫలకంపై పేర్లు చెరిపేశారు'

ప్రజాశక్తి-గంగవరం: గంగవరం పంచాయతీ మారేడుపల్లి సచివాలయం3 వద్ద పంచాయతీ పాలకవర్గ శిలాఫలకంకు టిడిపి పార్టీ గంగవరం పంచాయతీ జనరల్ కార్యదర్శి బాలాజీ శిలాఫలకంకు పెయింట్ కొట్టి పేర్లును చెరిపేశారని సర్పంచ్ చంద్రమ్మ విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దీనిపైన సోమవారం గంగవరం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఎంపీడీఓకి వినతి పత్రం ఇవ్వాలని వార్డు సభ్యులకు సూచించినట్లు తెలిపారు. పంచాయతీలో గెలిచిన వార్డు సభ్యులు, సర్పంచులు ఇరువర్గాల పార్టీ వాళ్లు కూడా అందులో ఉన్నారు, అక్కడి పేర్లుకు పెయింటింగ్ వేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

రక్తదానం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ప్రభుత్వ హాస్పిటల్‌లో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో 54మంది మదర్ థెరీసా కళాశాల విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలమనేరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతా రాణి మాట్లాడుతూ బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లో మదర్ థెరీసా విద్యార్థులు బ్లడ్ డొనేషన్ చేయడానికి ముందుకు రావడంతో చాలా ఆనందంగా ఉందన్నారు. బ్లడ్ డొనేట్ చేయడం వల్ల ఒకరి ప్రాణం మనం కాపాడిన వారు అవుతామని తెలిపారు. రక్తం ఇచ్చినంత మాత్రాన నీరసం వస్తుంది, ఇటువంటి అపోహలకి పోవద్దని సూచించారు. మళ్లీ 120రోజుల్లో కొత్త రక్తం తయారవుతుందని వివరించారు. యువత దీనిపై అవగాహన పెంచుకొని ముందుకొచ్చి రక్త దానం చేసి మరొకరి ప్రాణాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని డాక్టర్ మమతా రాణి, డాక్టర్ యుగంధర్ కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గోల్డెన్ వ్యాలీ విద్యార్థుల విరాళం

రామకుప్పం విద్యార్థులు

ప్రజాశక్తి-రామకుప్పం: విజయవాడ ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో వరదల కారణంగా అల్లాడుతున్న ప్రజల సహాయార్థం రామకుప్పం టౌన్ రాయల్ రూరల్ ఎడ్యుకేషన్ సొసైటీ చే స్థాపింపబడ్డ గోల్డెన్ వ్యాలీ స్కూల్ విద్యార్థులు, కరస్పాండెంట్ రాజేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందంతో కలిసి విరాళాలు సేకరించారు. వరదల్లో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్న విజయవాడ ప్రజల కోసం "మీకోసం మా వంతు సాయం" అంటూ విద్యార్థులందరూ రామకుప్పంలో ర్యాలీగా వచ్చి నిధులు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. విరాళంగా వసూలు చేసిన నిధులను సీఎం సహాయ నిధికి ఇవ్వటానికి విద్యార్థులు విరాళాలు సేకరించారు. మన విరాళం వలన వారికి ఆహారం, ఆశ్రయం, వైద్య సహాయం వంటి అవసరమైన సహాయం అందుతుందని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ బృందం తెలిపారు. రామకుప్పం టౌన్‌లో విద్యార్థుల కార్యక్రమానికి సహకరించి వారికి తోచినంత సహాయం అందించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కరస్పాండెంట్ రాజేష్ ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి మహోన్నత కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిన ఉపాధ్యాయ బృందం విద్యార్థుల పట్ల ప్రజలందరూ హర్షం వ్యక్తం చేశారు.

సోమల: నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న ఈశ్వర్

బీసీవై పార్టీ ఆధ్వర్యంలో..

సోమల: భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపకులు బోడె రామచంద్ర యాదవ్ ఆదేశాలతో సోమల మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు విజయవాడకు చేరుకున్నారు. అక్కడ వరద ముంపు ప్రాంతాలలో పేదలకు ముంపునకు గురైన కుటుంబాలకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్టు ఆ పార్టీ సోమల మండల నాయకులు ఈశ్వర్ తెలిపారు.

చిత్తూరు అర్బన్: సీఎం చంద్రబాబు పిలుపు మేరకు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ విజయవాడలోని 16వ వార్డులో బాధితులకు సేవలు అందిస్తున్నారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు చిత్తూరు నియోజకవర్గంలో రూ.30లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులను సేకరించి విజయవాడకు తరలించారు. 16వ వార్డులో వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నిత్యావసర వస్తువులను అక్కడ ప్రతి ఇంటింటికీ తిరిగి వరద బాధితులకు అందిస్తున్నారు. కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ సమన్వయ కర్త పల్లెంటి సునీల్ కుమార్, సంబంధిత అధికారులు, ఉమ్మడి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నాయుడుపేట: టిడిపి యువ నాయకుడు, సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తనయుడు నెలవల.రాజేష్ జన్మదిన పురస్కరించుకుని నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమానికి హాజరైన టిడిపి నాయకులు రాజేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో ఆయన పని చేస్తున్న తీరు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

పరిశ్రమ ఎదుట కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-నాయుడుపేట: మేనకూరు ఎస్‌సిజెడ్‌లో లాయల్ పరిశ్రమ లాకౌట్ పరిశ్రమ ముందు ధర్నా చేపట్టారు. రెండు డిపార్ట్‌మెంటలలోని కార్మికులను అర్ధాంతరంగా పనికి రావొద్దు అని చెప్పడంతో ఆగ్రహించి సిఐటియు ఆధ్వర్యంలో గేట్టు ముందు బేటాయించి నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ వచ్చి ఏసీఎల్ డీసీఎల్ ఫోన్‌లో వారి సమాచారాన్ని తెలియజేయడంతో సోమవారం లాయర్ పరిశ్రమ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి చట్ట ప్రకారం ప్రకారం రావలసిన అన్ని వారికి ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళా కార్మికులు ధర్నాను విరమించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి శివకవి ముకుందా మాట్లాడుతూ సుమారు 600 మంది కార్మికులు పనిచేస్తున్నారు, ఐదు డిపార్మెంట్లుగా పనిచేస్తున్న కార్మికులను డిపార్మెంట్ల వారీగా మూడు డిపార్మెంట్లలో ఉన్న కార్మికులను తొలగించడంతో మిగిలి ఉన్న రెండు డిపార్మెంట్ల కార్మికులను రేపటినుండి పరిశ్రమ లాకౌట్ చేస్తున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జై చంద్ర, ఎదుగుల విజయ్ కుమార్, లాయిల్ పనిచేస్తున్న కార్మికులు దీప, చాందిని, మౌనిక, అరుణ, సుశీల, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలిగి విజయాలు చేకూరాలి

- చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు

ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వినాయక చవితి పర్వ దినం సందర్భంగా జిల్లా ప్రజలకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో జిల్లాలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో అభివృద్ధిలో ముందడుగు వేయాలని అభిలాషించారు. వినాయక చవితి వేడుకలు, గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా సహజ సిద్ధంగా మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు.

ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: వినాయక పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సిఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవాల కమిటీ సభ్యులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి కోసం ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని, వారు ఆయా సమయాల్లో జలప్రవేశాలు చేపట్టాలన్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6లోపల జలప్రవేశాలు ముగించుకోవాలని, కానిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాయంత్రం 6గంటల లోపల ముగించాలన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలను కాపాడుకోండి..

ప్రజాశక్తి - తిరుపతి సిటి : రహదారి భద్రతానియమాలను ప్రతి ఒక్కరూ పాటించి, క్షేమంగా గమ్యాన్ని చేరాలని తిరుపతి ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలన్నారు. ఆపత్కాలంలో తిరుపతి పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8099999977 లేదా డయల్ 100 ను సంప్రదించి సేవలు పొందాలని ట్రాఫిక్ సిఐ చిన్న పెద్దయ్య అన్నారు. హెల్మెట్ వాడకం ఆవశ్యకతను తెలియజేస్తూ పోస్టర్‌ను ప్రద ర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ విజయ లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ ముని భాస్కర్ రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పోషకాలే మూలం

ప్రజాశక్తి - రేణిగుంట : రెయిన్బో ఈ స్మార్ట్ స్కూల్ లో నేషనల్ న్యూట్రీషన్ వీక్ ను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు సమతుల్యమైన ఆహారాన్ని , తీసుకొనవలసిన మోతాదులను అందరికీ అర్థమయ్యే విధంగా ఫుడ్ పిరమిడ్ ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అతావుల్లా ఖాన్ మాట్లాడుతూ "హెల్తీ ఫుడ్ ఈస్ హెల్తీ ఫ్యూచర్" అని విద్యార్థులకు నేర్పించారు.

భక్తులందరికీ శ్రీవారి లడ్డూ ప్రసాదాలు: ఈవో

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను భక్తులందరికీ అందుబాటులోకి తీసుకు రావాలని టిటిడి ఈవో జె.శ్యామలరావు అన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీడియాతో ఈవో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి ఆలయాలు, సమాచార కేంద్రాలలో లడ్డూ ప్రసాదాలను శాశ్వతంగా విక్రయించేందుకు చర్యలు చేపట్టామన్నారు. బయట ప్రాంతాల నుంచి చాలా కాలంగా భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారని, తిరుమలకు విచ్చేసే భక్తులకు లడ్డూలు సరిపోతు న్నందున బయట ప్రాంతాల్లో లడ్డూ ప్రసాదాలను విక్రయించలేదన్నారు. తిరుమలలో లడ్డూ దళారులను కట్టడి చేయడం ద్వారా బయట ప్రాంతాలకు లడ్డూ ప్రసాదాలు పంపుతున్నట్లు వివరించారు. ఆగస్టు నెలలో 22.42 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారని, రూ.125.76 కోట్లు హుండీ కానుకల ద్వారా ఆదాయం వచ్చింది. కోటి 6 లక్షల లడ్డూలను విక్రయించారని తెలిపారు. 24.33 లక్షల మందికి అన్నప్రసాదాన్ని అందజేశారు. 9.49 లక్షల మంది భక్తులు తలనీలాలను కల్యాణకట్టలో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బ్రహ్మోత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆవిష్కరించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం అనంతరం ఈ ఆవిష్కరణ నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ శ్రీధర్, సిఈ సత్యనారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ టి.రవి పాల్గొన్నారు.

త్వరలో దివ్య దర్శనం టోకెన్లు జారీ

తిరుమలకు కాలినడకన వచ్చే భక్తులకు త్వరలో అలిపిరి పాదాల మండపం వద్ద దివ్య దర్శనం టోకెన్లు జారీని పున: ప్రారంభించనున్నట్లు టీటీడీ ఈవో జె. శ్యామలరావు చెప్పారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, అన్న ప్రసాదాల నాణ్యత పెంచేందుకు టీటీడీ చేపట్టిన చర్యలను డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో పలువురు భక్తులు ప్రశంసించారు. మొత్తం 14 మంది భక్తులు డయల్ యువర్ ఈవోకు ఫోన్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు వెంకటేష్ తిరుమలలో డయాలసిస్ సౌకర్యాన్ని కల్పించాలని కోరగా, పరిశీలిస్తామని ఈవో సమాధానం ఇచ్చారు.

టిటిటి ఈవోకు తిలక ధారణ చేస్తున్న దృశ్యం

తిలకధారణ పున: ప్రారంభం

తిరుమలలో శ్రీవారి భక్తులకు తిలక ధారణ కార్యక్రమాన్ని టిటిడి ఈవో శుక్రవారం పున: ప్రారంభించారు. తిరుమల ఏటీసీ సర్కిల్ వద్ద ఈవోకు, భక్తులకు శ్రీవారి సేవకులు తిలక ధారణ చేశారు. శ్రీవారి సేవకులు తిరుమలలోని ఏటిసి, సుపథం, శ్రీ వరాహస్వామి ఆలయం, కళ్యాణకట్ట, విక్యూసి 1, 2 ల వద్ద నిరంత రాయంగా తిలక ధారణ చేస్తారని చెప్పారు.

మా పొట్ట కొట్టొద్దు..

సిఎంకు శ్రీవారి మెట్టు వ్యాపారుల లేఖ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

'పులిసాకుతో వ్యాపారాలు మూసేసి తమ పొట్ట కొట్టొద్దు' అంటూ శ్రీవారి మెట్టు వ్యాపారులు శుక్రవారం సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డికి, తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలనాధికారికి బహిరంగ లేఖలు రాశారు. తమ సమస్యలు పరిష్కరించాలని గత 17 రోజులుగా నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర మాట్లాడుతూ 17 రోజులుగా పరిపాలనా భవనం ఎదుట దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలు గడవక, పిల్లల ఫీజు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యుగంధర్, మధు, చిట్టిబాబు, మల్లికార్జున, రామ్మూర్తిరెడ్డి, ప్రకాష్, చిరంజీవి, సోను పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సన్మానం బాధ్యత పెంచింది'

ప్రజాశక్తి -రేణిగుంట:

తమ సేవలను గుర్తించి మీరు చేసిన సత్కారం తమ స్వచ్ఛంద సంస్థలకు మరింత బాధ్యతను పెంచిందని ఆషా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజు అన్నారు. రేణిగుంట ఎంఈఓ కార్యాలయం ఆవరణలో గురువారం టీచర్స్ డే సందర్భంగా రేణిగుంట మండలంలో విద్యా పరంగా సేవ చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులను గుర్తించి మండల విద్యాశాఖ తరపున ఘనంగా సన్మానించారు. ఎంఇఒలు ఇందిరాదేవి, రంగనాథ్ పాల్గొన్నారు. ఎస్‌టియు ఆధ్వర్యంలో స్థానిక బైరాగి పట్టెడలోని ఎస్‌టియు భవనంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ మాజీ శాసన మండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి సమావేశంలో మాట్లాడుతూ అన్ని వృత్తులలో కెల్లా ఉపాధ్యాయ వత్తి విశిష్టమైనదని తెలిపారు. తిరుపతి అర్బన్ ఎంఇఒ బాలాజీ పాల్గొన్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించిన పి.మురళీకృష్ణ, జి.దేవరాజులునాయుడులను సన్మానించారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళులు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్ : ఏర్పేడు మండలంలోని మేర్లపాక గ్రామంలో టిడిపి నాయకుడు తిరుమల శెట్టి వెంకటరమణ ఇటీవల ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఆయన మృతదేహానికి వారి స్వగ్రామంలో టిడిపి జెండా కప్పి రాష్ట్ర అధికార ప్రతినిధి గురువారెడ్డి, బొల్లినేని జగన్నాథం నాయుడు, పార్టీ నాయకులు నివాళులర్పించారు.

కంపు..కంపు..!

- రోడ్డుపైనే మురుగునీరు
- గుంతల మయమైన ఆర్అండ్‌బి రోడ్డు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- రామచంద్రపురం: మండలంలోని సి రామాపురం వద్ద ఆర్ అండ్ బి రోడ్డుపై మురుగు నీటి నిల్వలు ఉండడంతో కంపు కొడుతోంది. రాయలచెరువు ఆర్అండ్‌బి రోడ్డు పక్కన మురికి నీటి కాలువను చివరి వరకు నిర్మించకపోవడంతో మురికి నీరు మొత్తం రోడ్డుపై నిలిచిపోయాయి. వాహనాల రాకపోకల వల్ల మురికి నీరు వాహన చోదకులు, ప్రజలపై పడుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ముందు చూపు లేకుండా అధికారులు, పాలకులు మురికి నీటి కాలువ నిర్మాణం చేపట్టడం ప్రజల పాలిట శాపంగా మారింది. ఇటీవల నూతనంగా నిర్మించిన రోడ్డు సైతం మురుగు నీరు నిలవడంతో గుంతల మయంగా మారిపోతోంది. దీనికి తోడు మండలంలో విష జ్వరాల బారిన పడి చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి తరుణంలో నడి రోడ్డుపై మురికి నీరు నిలచిపోయి ఉంటే నిత్యం అదే దారిలో ప్రయాణం చేసే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు నిలిచిపోవడంతో ఆ రోడ్డు మడుగును తలపిస్తోంది. ఇకనైనా పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెంటనే స్పందించి మురికి నీటి కాలువ సమస్య పరిష్కారానికి చర్యల చేపట్టి మురుగు నీరు నిలవకుండా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపైనే మడుగులా మారిన మురుగునీరు

అమృత సరోవర్ భూగర్భ జలాలు వృద్ధికి సోపానాలు

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ఆశిష్ గుప్తా

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: అమృత సరోవర్ భూగర్భ జలాలు వృద్ధికి సోపానాలు అని – కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ఆశిష్ గుప్తా పేర్కొన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ఆశిష్ గుప్తా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివ ప్రసాద్, తిరుపతి జిల్లా డ్వామా పథక సంచాలకులు సివి శ్రీనివాస్ ప్రసాద్, పుత్తూరు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.సరిత కలిసి ఏర్పేడు మండలం కోబాక, బండారుపల్లి పంచాయతీలలో చేపట్టిన అమృత్ సరోవర్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ లో అమృత్ సరోవర్లను చేపట్టడం వల్ల గ్రామీణ పేద ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించడంతోపాటు గ్రామ పరిసరాలలో భూగర్భ జలాల వృద్ధి చెంది పరిశుభ్రమైన తాగునీరు గ్రామీణులకు అందడం వల్ల ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చున్నారు. అమృత్ స్వరోవర్లలో చేపల పెంపకం చేపడం వలన గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులు చేకూరుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణా భివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ఆశిష్ గుప్తా 17 అడుగుల రావి చెట్టును, గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ వేప చెట్టును కోబాక అమృత్ సరోవర్ వద్ద నాటి, అమృత్ సరోవర్ కట్ట చుట్టూ చెట్లను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ గిడ్డయ్య, పిఓపిఆర్ అండ్ ఆర్ డి రమణ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పున్నారావు, గ్రామ ప్రజా ప్రతినిధులు, అదనపు కార్యక్రమాధికారి ఆవిలాల దేవరి, జె ఇ బాలాజీ రావు, టి ఏలు రవీంద్రుడు, పట్టాభి రెడ్డి, కల్పన, వేంకటాద్రి, మనోహర్ లు, సచివాలయం ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ భూగర్భ జలాలను పరిశీలిస్తున్న అధికారులు

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని భైరవ ఎస్టి కాలనీలో యువ నేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువ నేస్తం అసోసియేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వినోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యా వరణాన్ని మనం పరిరక్షించు కుంటే అది మనల్ని రక్షిస్తుం దన్నారు. వినాయక చవితి పండుగ దినాన్ని పురస్కరించు కొని ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన గణ పతులను వినియోగించాలన్నారు. రంగుల విగ్రహాల వల్ల పర్యావరణం, నీరు కలుషితం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షు లు ముని శేఖర్, మండల కోఆర్డినేటర్ నాగమణి, వాలంటీర్లు వెంకటేష్, స్వర్ణ పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు అన్నారు. గూడూరు జనసేన కార్యాలయం లో శుక్రవారం ఆ పార్టీ నాయ కులు ఆధ్వర్యంలో మట్టి వినాయ కుల ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జనసేన సిద్ధాంతాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షించాలనే ఉద్దేశంతోనే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సూచనలతో మట్టి వినాయకుల ప్రతిమలు పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థి దశ నుండే పర్యావరణ పరిరక్షణపై పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని కోరారు. రోజురోజుకీ పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుం దని మట్టి వినాయకుని ప్రతిమలు పూజించడం ద్వారా, నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణంలో ఇబ్బందులు తలెత్తవన్నారు. పర్యావరణ పరిరక్షణకు మన వంతు బాధ్యత నిర్వర్తించాలని, కులమతాలకు అతీతంగా అందరూ సంతోషంగా పండు గ జరుపు కోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు పీఓసీ మోహన్, కార్యదర్శులు ఉప్పు సాయి కిరణ్, మట్టింపాటి సనత్, నాయ కులు కార్తీక్, మహేష్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి లో

గూడూరు జనసేన కార్యాలయంలో

వేళకు రాక.. వచ్చినా ఆపక

- విద్యార్థులకు తప్పని అగచాట్లు
- ఆర్‌టీసీ డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణం
- పట్టించుకోని అధికారులు

రాగిమానుపెంట వద్ద.. బస్సు ఆపకుండా వెళ్లిపోవడంతో మరో బస్సుకోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఆర్‌టీసీ బస్సు పాసులు మంజూరు చేసింది. నెల, మూడు నెలలకోసారి చొప్పున ఈ పాసులకు కొంత సొమ్ము చెల్లించి పొందాల్సి ఉంటుంది. ఆయా స్టేజీల నుంచి బస్‌పాస్ చెల్లుబాటు అవుతుంది. కాగా విద్యార్థులంతా పాసులు పొందినా ఆయా స్టేజీల వద్ద బస్సులు ఆపకపోవడంతో వారికి అగచాట్లు తప్పడం లేదు. బస్సు ఆపినా విద్యార్థులు బస్సులోకి రాకముందే వెళ్లిపోతున్నారు. కొందరు విద్యార్థులు రన్నింగ్ బస్సు ఎక్కి కళాశాల సమయానికి తంటాలు పడి చేరుకొంటుండగా, ఇంకొందరు ఆలస్యంగా వెళు తున్నారు. కాగా కదిలే బస్సును ఎక్కే క్రమంలో విద్యార్థులు పడిపోవడం వంటి పరిస్థితులు ఉన్నాయి. ఆలస్యమైతే కళాశాల, పాఠశాలల్లో లేట్‌కమర్‌గా పరిగణించి బయటనే నిలబెట్టేస్తున్నారు. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా చదువుకుంటున్న విద్యార్థుల పట్ల ఆర్‌టీసీ డ్రైవర్ల నిర్లక్ష్యం చేసి బస్సులు ఆపకుండా వెళుతుండటమే కారణం. బంగారుపాళ్యం మండలం రాగిమాను పెంట నుంచి కొంతమంది విద్యార్థులు రోజూ చిత్తూరు కళాశాలకు వెళుతుంటారు. ప్రతి రోజూ 8.30గంటలకు బస్సు రావాల్సి ఉంది. ఆ సమయానికి విద్యార్థులు అక్క డికి చేరుకొని బస్సుకోసం ఎదురుచూస్తుంటారు. ఇదం తా గమనించిన ఆర్‌టీసీ డ్రైవర్లు సమాయానికంటే ముందుగా లేదా ఆలస్యంగా స్టేజీల వద్దకు వచ్చి విద్యార్థులు బస్సు ఎక్కకనే వెళు తుండటం వంటివి ప్రతి రోజూ పరిపాటి. కాగా శు క్రవారం రోజూలానే అక్కడికి పది మంది కళాశాల విద్యార్థులు వచ్చి బస్సుకోసం ఎదురు చూస్తున్నారు. చిత్తూరు డిపోకు చెందిన పల్లెవె లుగు బస్సు వచ్చి ఆగినట్లే ఆగి వెళ్లిపోయింది. పరుగున బస్సు ఎక్కేందుకు ప్రయత్నించినా విద్యార్థుల ప్రయత్నం విఫలమైంది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ రోజూ ఇలానే ఇబ్బందులు పడుతున్నామని, ఇతర వాహ నాల్లో చార్జీలు పెట్టుకొని వెళదామంటే బస్‌పాస్‌లు ఉం డడంతో కనీసం డబ్బులు తెచ్చుకోలేదని చెప్పారు. కళా శాలలో సమయానికి చేరుకోకుంటే ఇబ్బంది తప్పదని ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌టీసీ ఉన్నతాధికా రులైనా స్పందించి బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

రాయితీపై ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని కెంచనబల్ల రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీ ద్వారా ఉలవలను రాష్ట్ర టీడీపి నేతలు మునస్వామి, నారాయణ చారి, రామమూర్తి చేతుల మీదు గా పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంట వేసుకునేందుకు రూ.174లకే 10కేజీల ఉలవలను అంది ంచడం జరిగిందన్నారు. రైతులకు డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీ ద్వారా యంత్రాలు, బ్యాంకు రుణాలు అన్ని విధాల ప్రోత్సాహాలు అందిస్తూ.. రైతుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందన్నారు. ఈ అవకాశాల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిరెడ్డి, చంద్రారెడ్డి, సతీష్, గుణశేఖర్, శ్రీరాములు, వెంకటరమణ, బద్రీనాథ్, రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటా ఓటరు సర్వే

ప్రజాశక్తి-విజయపురం: మండలంలో ఓటరు సర్వే నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఇల్లత్తూర్ గ్రామంలో డిఎన్‌ఓ ఇంటింటికి ఓటరు పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డోర్ టు డోర్ ఆయన లబ్ది హోటల్‌లోని అడిగి తెలుసుకున్నారు. వంద వరకు ఓటర్లు చేపట్టిలను పరిశీలించారు. అనంతరం మరణించిన వారి పేర్లను తొలగిస్తూ నూతనంగా ఓట్ల నమోదు కార్యక్రమం చేస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయం

- పశువైద్య ఏడీ మురళి మోహన్

సమావేశంలో మాట్లాడుతున్న పశు వైద్యశాఖ ఏడీ మురళి మోహన్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: స్వచ్ఛంద సంస్థల సేవల కృషితోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని గంగాధర నెల్లూరు పశువైద్యశాఖ ఏడి మురళీమోహన్ అన్నారు. ఈ సందర్భంగా కాసా సంస్థ ఐదు రాష్ట్రాల జోనల్ ఆఫీసర్ కరుణాకర్ ఆధ్వర్యంలో గంగాధర నెల్లూరులో 250కుటుంబాలకు రూ.3వేలు విలువ చేసే 10కోడి పిల్లలు, వర్మీ కంపోస్టు, అజోల్ల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, ఏవో భవాని, మండలం సర్వేయర్ గణేష్, హార్టీకల్చర్ అధికారి లోకేష్, కాసాసంస్థ ప్రతినిధులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

ఏర్పాట్లును పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వినాయక నిమజ్జనానికి సంబంధించి చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కట్టమంచి చెరువు వద్ద అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేసినట్లు సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ తెలిపారు. శుక్రవారం కట్టమంచి చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను నగరపాలక అధికారులతో కలిసి పరిశీలించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లు, ఉద్యోగులు, సిబ్బంది కేటాయింపు, విధుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. నిమజ్జనం సజావుగా సాగేందుకు వీలుగా.. కట్టమంచి చెరువు కట్టపైన ప్రత్యేక వేదిక నిర్మించారు. బారికేట్ల నిర్మాణం, లైటింగ్, నీటి సరఫరా, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేయడానికి వీలుగా రెండు పెద్ద క్రేన్లను అందుబాటులో ఉంచనున్నారు. ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పూర్తి చేశారు. వినాయక చవితి రోజు నుంచి ఏడు రోజులపాటు నిమజ్జనం సజావుగా సాగేందుకు వీలుగా ఉద్యోగులు, సిబ్బందిని నియమించారు. ఇంజనీరింగ్ విభాగం నుంచి కార్యదర్శులు, ఆపరేటర్లు, ఫిట్టర్లు, ప్రజారోగ్య విభాగం నుంచి కార్యదర్శులు, మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులను షిఫ్టుల వారీగా విధులు కేటాయించారు. మెడికల్ క్యాంపు నిర్వహించనున్నారు. కట్టమంచి చెరువు కట్టపై నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని.. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా నగర ప్రజలు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఈ రజని, శానిటరీ ఇన్స్పెక్టర్ నరసింహ, సీఎం గోపి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల మెరుపు సమ్మె

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో వారు ఏరియా హాస్పిటల్ వద్ద శుక్రవారం సిఐటియు సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా, వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్‌ల ఆధ్వర్యంలో సమ్మెల్చే నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మికులకు జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ ఆసుపత్రిలో విధులు నిర్వహించకపోతే పారిశుద్ధ్య లోపం ఎక్కువ ప్రమాదం ఉందని దీనివల్ల పేషెంట్లు అనారోగ్యంతో ప్రాణాలు వదిలి పరిస్థితులు వస్తాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కాంట్రాక్టర్లు వెంటనే పారిశుద్ధ కార్మికులకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సూపరింటెండెంట్ మమతారాణి, ఆర్ఎంవో శారదకు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ వారు ఇచ్చిన వినతి పత్రం ఉన్నతాధికారులకు చేరవేసి త్వరలోనే జీతాలు ఇప్పిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ జీతాలు వచ్చేంత వరకు సమ్మె కొనసాగిస్తామని విధులకు హాజరు కామని కరాకండిగా తేల్చి చెప్పారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షులు దేవ, కార్యదర్శి లోకేష్, లత, గీత, శ్యామల, సుజాత, అశ్విని, నాగమ్మ, బుజ్జమ్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని ఇల్లత్తూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆయా పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేందుకు చర్యలు చేపడుతున్నారు. వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, మురికి కాలువల్లో పూడికతీయించే పనుల్లో నిమఘ్నమైయ్యారు. శుక్రవారం ఇల్లత్తూరులో ఇన్‌ఛార్జ్ ఈవోఆర్‌డీ ఎంఎస్ సురేంద్రకుమార్, సర్పంచ్ దీప్తిగోపిలు పర్యవేక్షించారు. ఓవర్ హెడ్ ట్యాంకు సమీపంలో జెసీబీతో పిచ్చి మొక్కలు తొలగించారు. మరమ్మతుకు గురైన చేతిపంపులను సరిచేసి తాగునీటికి ఇబ్బంది లేకుండా చొరవ తీసుకున్నారు. గ్రామ సమీపంలో ఉన్న పేడదిబ్బలను తొలగించి గ్రామానికి దూరంగా తరలించారు. ఆ మేరకు గ్రామస్తులకు సూచనలిచ్చారు. రోడ్డుకు ఇరువైపులా జెసిబి సహాయంతో రోజంతా పిచ్చి మొక్కలను ముళ్ళ కంపలను తొలగించారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో వ్యర్థమైన బాటిల్స్, టైరు వంటివి లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటిలో వాడే నీటిని వీధుల్లో వదలకుండా మురికి కాలువ ద్వారా వదలాలని లేదంటే ఇంకిట గుంత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు పొడి చెత్త, తడి చెత్తను వేరుచేసి గ్రీన్ అంబాసిడర్ ద్వారా వెహికల్‌లో వేయాలని తెలిపారు.

సోమల ఇరికిపెంటలో..

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట గ్రామంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల చే ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మేనక మాట్లాడుతూ గ్రామంలో మురుగు నీటి కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారం పిచ్చి మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించడం జరిగిందని దోమల నివారణలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అనేక లాభాలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

ప్రజాశక్తి-గుడిపల్లి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించడం వల్ల అనేక లాభాలు ఉంటాయని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. శు క్రవారం మండలంలోని కనమనపల్లి రైతు సేవా కేంద్రంలో వాతావరణ ఆధారిత పంటల సాగు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షల ఆధారిత ఎరువుల వాడకం, వివిధ పంటలలో పాటించ వలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి చిత్తూరు జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సంధ్య రాణి హాజరైయ్యారు. ఆ తరువాత వరి, రాగి, వేరుశనగ పొలంబడి, చామంతి తోటలను సందర్శించి తగిన సూచనలు ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాలు సాగును ప్రోత్సహించాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది నవీద్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలి: సిపిఐ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గత ప్రభుత్వంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ప్రజా ప్రతినిధులు వేధింపులను మానుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకులు రామానాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన చిత్తూరులో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ భూములను, ప్రైవేటు వ్యక్తుల భూములను కబ్జా చేసిన వారిపై ప్రభుత్వం ఇంతవరకు చర్యలు ఎందుకు తీసుకోలేదు ఎందుకు అరెస్ట్ చేయలేదు అని సూటిగా ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తే గత వైసీపీ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని దుయ్యబెట్టారు.

పర్యావరణ హితం కోరాలి: కలెక్టర్

కలెక్టర్ సుమిత్‌కుమార్

జెసి విద్యాధరి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి మట్టి వినాయక విగ్రహాలతో పూజ లు చేయాలని, వినాయక చవితి పండగను ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని విఘ్నా లను, సంకటాలను తొలగించి విజయాన్ని అందించే వినా యక పండుగ ప్రతి ఇంట ఆయురారోగ్యాలు, సుఖ సంతోషా లతో, సిరి సంపదలతో తుల తూగాలని కోరుకుంటూ.. మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు చేసిన వారమవుతాని తద్వారా పర్యావరణాన్ని కాపాడు కునేలా ప్రతి ఒక్కరూ ఈ విషయంలో భాగస్వాములు కావాలని కలెక్టర్, జెసి జి.విద్యాధరి, డిఆర్‌ఓ బి.పుల్లయ్య ఆ ప్రకటనలో సూచించారు.

విఘ్నాలు తొలిగి విజయాలు చేకూరాలి: ఎస్పి

ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వినాయక చవితి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు ఎస్పీ మణికంఠ చందోలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో జిల్లాలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో అభివృద్ధిలో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలు, గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పరిసరాలను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌వో

● 'ఫ్రైడే - డ్రైడే'లో డిఎంహెచ్‌వో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్‌వో ప్రభావతి దేవి సూచించారు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలుంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో సంప్రదించాలని చెప్పారు. శుక్రవారం స్థానిక చవలపల్లి అర్బన్‌హెల్త్ సెంటర్ పరిధిలోని పెద్ద హరిజన వాడలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ప్రజలను ఆరోగ్య సమస్యలు అడిగి తెసుకున్నారు. డిఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారానికి ఒక్కసారి శుక్రవారం డ్రైడే పాటించాలని, వాడే నీటి తొట్లు, డ్రమ్ములు, బిందెలు మొదలగునవి శు భ్రపరుచుకుని నీళ్ళు నింపుకుని దోమలు నేరుగా నీటిపై వాలకుండా మూతలు లేదా పలుచటి గుడ్డను చుట్టుకోవాలని, పనికిరాని పగిలిన కుండ పెంకులు, పాత టైర్లు, టెంకాయ చిప్పలు, ప్లాస్టిక్ వస్తువులు మొదలగునవి దూరంగా వేయాలన్నారు. సాయంత్రం వేళల్లో ఇటికీలు, తలుపులు వేసుకోవాలని, దోమతెరలు వాడుకోవాలని, వేపాకు పొగ వేసుకోవాలని అలాచేసిన వ్యుడు డెంగీ, చికున్ గున్యా, మలేరియా, బోదకాలు మొదలగు జ్వరాలు రాకుండా అప్రమత్తంగా వుండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసెస్టెంట్ మలేరియా అధికారి రామచంద్రా రెడ్డి, అర్బన్ సబ్ యూనిట్ ఆఫీసర్ రామకష్ణ, ఆశా కార్యకర్త వసంత పాల్గొన్నారు.

జిల్లా ప్రగతికి కృషి చేస్తున్నాం

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పి చైర్మెన్

జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్వసభ్య సమావేశం జెడ్పీ సమావేశపు మందిరంలో జెడ్పీ చైర్మన్ అధ్యక్షతన ప్రారంభం కాగా ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విచ్చేశారు. వీరితో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్..లతో పాటు తిరుపతి ఎంపి గురుమూర్తి, ఎమ్మెల్సీలు భరత్, చంద్రశేఖర్ రెడ్డి, చంద్రగిరి, జీడీ నెల్లూరు, తిరుపతి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తినాని, డాక్టర్ థామస్, ఆరణి శ్రీనివాసులు, కె.మురళీమోహన్‌లు పాల్గొన్నారు. వీరితో పాటు జెడ్‌పి వైస్ చైర్మన్ రమ్య, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జెడ్‌పి సిఈవో గ్లోరియా, తిరుపతి డిఆర్‌వో పెంచల కిషోర్, జెడ్‌పిటిసిలు, ప్రత్యేక ఆహ్వానితులు, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో జిల్లాను ప్రగతి పథంలో ముందుకు నడిపించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా 100రోజుల ప్రణాళికలో ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు చేపడుతున్నామని వివరించారు. నూతన ఇసుక విధానం జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని, స్టాక్ యార్డుల నుంచి ఇప్పటి వరకు 70వేల మెట్రిక్ టన్నులు వినియోగదారులకు అందించామన్నారు. ప్రజా ప్రతినిధులు ఏం మాట్లాడారంటే.. తిరుపతి ఎంపి మాట్లాడుతూ.. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణకు సంబంధించి పింక్ బస్సు ద్వారా ప్రాథమికంగా పరీక్షలు నిర్వహించిన వారికి వ్యాధి నిర్ధారణ తరువాత దాని నుంచి బయట పడేందుకు పూర్తి వైద్య సేవలు అందించాలని దేశవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధి భారీన పడి చనిపోతున్నారని తెలిపారు. దీనిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. తిరుపతి డిఎంహెచ్‌వో శ్రీహరి సమాధానమిస్తూ.. పింక్ బస్సు ద్వారా వ్యాధి నిర్ధారణ చేసిన వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని 101పిహెచ్‌సిలలో ప్రతి పిహెచ్‌సిలలో ఇద్దరు డాక్టర్లు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. జిడి నెల్లూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని పిహెచ్‌సిలలో పని చేసే డాక్టర్లు అలస్యంగా రావడం మధ్యాహ్నం మూడు గంటల కల్లా వెళుతున్నారని, ఏదైనా ఆరోగ్య సమస్యలతో ప్రజలు వస్తే సియంసికి వెళ్లాలని రోగులను పంపిస్తున్నారని తెలిపారు. పీహెచ్‌సి లలో ల్యాబ్ సరిగా పనిచేయడం లేదని ఇందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. చంద్రగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ పాకాల ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని 50పడకల ఆసుపత్రిగా మార్చాలని, ఏదైనా చిన్న సమస్య వస్తే కొత్త కోటకు వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. పూతలపట్టు – నాయుడుపేట హైవేకి సంబంధించి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయని, హైవే పక్కన ఎక్కడ ప్రభుత్వం ఆసుపత్రి లేదని, హైవే పక్కన ఆసుపత్రి ఏర్పాటు చేయాలని రోడ్డు ప్రమాదాలకు గురైన వారు అంబులెన్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. విద్యాశాఖ సమీక్షలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటుకు సంబంధించి ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా, కలెక్టర్ స్పందిస్తూ.. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఉపాధ్యాయుల సర్దుబాట్లు చేయడం జరిగిందన్నారు. మనబడి – మన భవిష్యత్తు కార్యక్రమంలో ఎంపికైన పాఠశాలలో అసంపూర్ణంగా పనులు జరుగుతున్న కారణంగా విద్యార్థులకు సరైన భద్రత కల్పించాలని పనులు జరుగుతున్న పాఠశాలలో పిల్లలు ఆ ప్రాంతానికి వెళ్లకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. గత 10వ తరగతి పరీక్షా ఫలితాలలో తిరుపతి, చిత్తూరు జిల్లాలో ఉత్తీర్ణతా శాతానికి అన్నమయ్య జిల్లాలో ఉత్తీర్ణతా శాతానికి చాలా వ్యత్యాసం కలదని అందుకు గల కారణాలను వివరించాలని కోరారు. ఇందుకు విద్యాశాఖ అధికారులు వివరిస్తూ.. పనులు జరుగుతున్న పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని సమగ్ర శిక్ష ఏపిసి వివరించారు. 10వ తరగతిలో అన్నమయ్య జిల్లాలో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండడానికి కారణం కొంతమంది పిల్లలు పాఠశాలకు రాకపోవడంతో పాటు చదువు పట్ల ఆసక్తి చూపడం లేదని ఆ జిల్లా విద్యాశాఖాధికారులు వివరించారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం..

● నగరపాలక ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ

మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న నగర మేయర్, గురజాల చెన్నకేశవులు నాయుడు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ మట్టితో చేసిన విగ్రహాలను పూజిద్దామని నగర మేయర్ ఎస్.అముద పిలుపునిచ్చారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో.. చిత్తూరు నగరపాలక సంస్థ, జీజెఎం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవుల నాయుడు, సోదరుడు గురజాల జీవన్‌తో కలిసి ప్రజలకు మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, జల కాలుష్యాన్ని నివారించడం కోసం ప్రజలు మట్టి వినాయక విగ్రహాలని పూజించాలని కోరారు. 2000మట్టి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, మేనేజర్ గోపాలకష్ణ వర్మ, సీఎంఎం గోపి, ఏఈలు లోకేష్, రజని, నగర పాలక సంస్థ అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.